క్లుప్తంగా

పద్యనాటక వైభవాన్ని చాటిన ప్రదర్శనలు



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి, శ్రీనివాస నాట్యమండలి యూనిట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న పద్యనాటికలు ఆదివారం ముగిశాయి. కలియుగ నాథుడు శ్రీనివాసుని లీలలు వర్ణిస్తూ కలియుగ వైకుంఠం నాటకం, తిరుపతి వెంకట కవులు రచించిన పాండవ ఉద్యోగ విజయాల్లోని పడక సీను, చిలకమర్తి లక్ష్మీనరసింహపంతులు రచించిన గయోపాఖ్యానంలోని సన్నివేశాలను ప్రదర్శించారు. దత్తుబాబు, ప్రసాద్‌బాబు, బుజ్జి సాహెబ్, సోని, ఆంజనేయులు, దాసుబాబు, గాబ్రియేలు నటించారు. నటీ నటులను నిర్వాహకులు సత్కరించారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం కళాకారిణులు నృత్య నీరాజనాలను అర్పించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీతాండవ నృత్య, డ్యాన్స్, మ్యూజిక్ అకాడమీకి చెందిన జానకీ మోహన్‌రావు, విజయ్‌ల పర్యవేక్షణలో 14 మంది కళాకారిణులు తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నయన శిఖర, అన్నపూర్ణ, పూజిత, దీక్షిత, సిరి లిఖిత, సిద్ధిక్ష, నిక్షిత, జాశ్రీత, శ్రీశాన్విలతో పాటు మరి కొంత మంది పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వ్యాపార వర్గాలకు అండగా ఉంటాం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వ్యాపార వర్గాలకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా డూండీ ప్రమాణ స్వీకార మహోత్సవం పాతబస్తీలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, జీవీ ఆంజనేయులు, పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ రాష్ట్రంతో పాటుగా తెలంగాణా, కర్నాటకు చెందిన పలువురు ఆర్యవైశ్య నేతలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా డూండీ రాకేష్‌తో పాటు ఇతర డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి(కేబీసీ) జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1980వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ మొగల్రాజపురంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం కలుసుకున్నారు. 44 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధులు లేవు. పాఠశాల తరగతి గదిలో చేసిన చిలిపి పనులను గుర్తుకు చేసుకుని రోజంతా ఉత్సాహంగా గడిపారు. 1980వ సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో స్కూల్‌లో అత్యధిక మార్కులు పొందిన జాస్తి శ్రీనివాస్‌ను సత్కరించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందించాలని పూర్వ విద్యార్థులు వీవీడీవీఎస్ ప్రసాద్, యడమ చందు, కోనేరు ప్రమీలా, మద్దె ఉషశ్రీ, కొల్లి సుధా చెప్పారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి ఆటలు, పాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. చిన్ననాటి స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించుకుని వచ్చే ఏడాది మరోసారి కలుద్దామంటూ వెనుతిరిగారు. నగరంతో పాటుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, విదేశాల నుంచి 130 మంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల కలయికలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలతో సతమతం

- ప్రధాన కూడళ్లలో ఇష్టారాజ్యంగా వాహనాలను నిలిపివేస్తున్న ఆటోవాలాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు
- చలానాలకే పరిమితమయ్యారంటూ పోలీసులపై విమర్శలు



లోబ్రిడ్జి వద్ద నిలిపి ఉంచిన ఆటోలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిన క్రమంలో ఇష్టారాజ్యంగా రహదారులపై నిలిపివేస్తున్న ఆటోవాలాలు, వాహనదారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్య.. నిలిచిపోతున్న వాహనాలు... పట్టించుకోని అధికారలంటూ.. నగర వాసులు గగ్గోలు పెడుతున్నా... సమస్యకు మాత్రం పరిష్కారం లభించటం లేదు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆటోవాలాలతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది ఆకతాయిలు సైతం ఆటో డ్రైవర్లుగా మారి నడుపుతుండటంతో కొన్ని ప్రాంతాల్లో వివాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. నడిరోడ్డుపై ఆటోలను ఆపేసి ఘర్షణలకు దిగుతున్న సంఘటనలు పాతబస్తీలో నిత్యకృత్యమయ్యాయి.

ప్రమాదాలు జరుగుతున్నా వైనం

ప్రధాన కూడళ్లలో ఆటోవాలాలు తమ వాహనాలను అడ్డదిడ్డంగా ఆపి ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్నారు. కనీసం వెనుక ముందు కూడా చూడకుండా వాహనాల రాకపోకలను సైతం పట్టించుకోకుండా ఆటోలను నిలుపుతుండటంతో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. కాశేశ్వరరావు మార్కెట్ బస్‌టెర్మినల్ నుంచి లోబ్రిడ్జిలోకి వచ్చే మలుపు వద్ద ఒకేసారి నాలుగైదు ఆటోలు ఒకదాని పక్కన ఒకటి రోడ్డుకు అడ్డంగా ఉంచి ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే లోబ్రిడ్జి దిగువన ఉన్న మెట్లు వద్ద సైతం అడ్డంగా ఆటోలు ఉంచి ప్రయాణికులను పిలుస్తున్నారు. వాటితో వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఒక్కసారిగా వీటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఒకవేళ ఎవరైనా ఆటోను రాసుకొని వెళ్లితే అక్కడ ఆటోవాలాలు వీరంగం వేసి రోడ్డుపై గందరగోళాలను సృష్టిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు ప్రతి రోజూ దర్శనమిస్తున్నాయి.

గద్దబొమ్మ సెంటర్‌లో దారుణం

గద్దబొమ్మ సెంటర్‌కు సమీపంలో లోబ్రిడ్జి నుంచి మార్కెట్ వైపు వచ్చే క్రమంలోనూ ఆటోవాలాలతో ప్రయాణికులు అల్లాడుతున్నారు. ఫ్లై ఓవర్ దిగువన కెనాల్ ఒడ్డున వరుసగా ఆటోలు పెట్టడంతో లోబ్రిడ్జి నుంచి కళాక్షేత్రం వరకు ట్రాఫిక్ నిలిచిపోతుంది. వందలాది వాహనాలు నిలిచిపోయినా ఆటోలను అలాగే రోడ్డుకు అడ్డంగా పది పదిహేను ఆటోలను ఉంచి ప్రయాణికులను పిలుస్తుంటారు. పోలీసులు అక్కడే ఉన్నా వారి వైపు ఏమాత్రం పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వినాయకుని గుడి నుంచి మార్కెట్ వైపు వచ్చే మార్గంలోనూ ఆటోలు అడ్డంకిగా మారుతున్నాయి. దీంతో నగర వాసులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

పోలీసులు దృష్టి పెట్టాలి

పోలీసు ఉన్నతాధికారులు ఇటీవల హెల్మెట్‌ల కోసం ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహిస్తున్నారు. దాదాపుగా ప్రతి రోజూ వందలాది ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేసి జరిమానాలను విధిస్తున్నారు. అయితే ట్రాఫిక్ సమస్యలను సృష్టిస్తున్న ఆటోలపై దృష్టి పెట్టడం లేదంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. నగరంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం వచ్చిన ఆటోలు రోడ్డుకు అడ్డంకిగా పెడుతుండటంతో పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటిపై అధికారులు దృష్టి పెట్టి ట్రాఫిక్ సమస్యలను నివారించాలని వన్‌టౌన్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముగిసిన సామవేదం ప్రవచనాలు



పురాణాల విశిష్టతను వివరిస్తున్న సామవేదం

విజయవాడకల్చరల్: రుషిపీఠం విజయవాడ, భారతీయ సనాతన వేదిక ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య కళాశాలలో తొమ్మిది రోజులుగా మన కోసం మన పురాణాలు అంశంగా నిర్వహిస్తున్న ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. సామవేదం షణ్ముఖశర్మ మాట్లాడుతూ పురాణాలు నేటి కాలానికి అందనప్పటికీ అవి నిత్యనూతనాలు అని వివరించారు. మన పురాణాలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయన్నారు. ఆగమ శాస్త్రంలోని అనేక అంశాలు మన పురాణాల్లో కనిపిస్తాయన్నారు. వాస్తు విజ్ఞానం గురించిన అనేక అంశాలను వివరించారు. వివిధ పురాణాల్లో పరమేశ్వరుని రూపాలు, నామాలు వివరిస్తూ ఈశ్వర శక్తి ఏవిధంగా ఉంటుందో తెలిపారు. సాహితీవేత్త కప్పగంతు రామకృష్ణ నిర్వహించారు. పాటిబండ సుందరరావు, ఆలమూరి శ్రీనివాస్, తొండెపు రత్నశ్రీనివాస్‌లు షణ్ముఖశర్మను ఘనంగా సత్కరించారు.

సందడిగా పుస్తక మహోత్సవ ప్రాంగణం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి, స్టాల్స్‌ను తిలకించారు. సమాజ అభ్యుదయానికి కావాల్సిన అన్ని రకాల సాహిత్యాన్నీ ప్రజలకు అందించేందుకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి కృషి చేస్తోందని ఆ సంస్థ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో విశాలాంధ్ర విజ్ఞానసమితి ప్రచురించిన నాలుగు పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ.. వివిధ భారతీయ భాషలూ, ప్రపంచ భాషల నుంచి కూడా అభ్యుదయ సాహిత్యాన్ని తెలుగులోకి మార్చి అందించేందుకు తాము ప్రయత్నిస్తామన్నారు. ఈ సభలో కోబడ్ గాంధీ రచించిన 'బీటలువారిన స్వేచ్ఛ'ను నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సి.నరసింహారావు ఆవిష్కరించారు. డాక్టర్ మహీధర్ నళినీ మోహన్ రచించిన 'నక్షత్ర వీధుల్లో భారతీయుల పాత్ర'ను సిద్దార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర కల్పన ఆవిష్కరించారు. పుస్తకాన్ని తుమ్మల శ్రీకుమార్ సభకు పరిచయం చేశారు. డాక్టర్ గార్గి చక్రవర్తి. సుప్రియా చోటాని రచించిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తొలి రోజుల చరిత్ర పుస్తకాన్ని అఖిల భారత మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు డాక్టర్ కూనం నేని రజని ఆవిష్కరించారు. పరుచూరి జమున పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. పెన్మత్స దుర్గాభవాని, అక్కినేని వనజలు తొలి ప్రతులను స్వీకరించారు. వివిన మూర్తి రచించిన వాడూ-నేనూ పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ హరనాథరెడ్డి ఆవిష్కరించారు.

పిడికిటి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ

పుస్తక మహోత్సవ సంఘం సంస్థాపక కోశాధికారి పిడికిడి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ ఆదివారం విజయవాడ పుస్తక మహోత్సవం ప్రాంగణంలో నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పుస్తక ప్రచురణను ఒక సామాజిక బాధ్యతగా భావించి, చివరి వరకూ అలాగే నిర్వహించిన ఆదర్శవంతుడు పిడికిటి రామకోటేశ్వరరావు అన్నారు. 'పిడికిటి రామకోటేశ్వరరావు జ్ఞాపకాలు' పుస్తకాన్ని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ తెలుగువారు జాతీయస్థాయిలో రాణించడానికి హిందీ భాషతో బలమైన అనుబంధం ఉండటమే కారణమన్నారు. ఆ అనుబంధం బలపడటానికి కృషిచేసిన వారిలో కోటేశ్వరరావు ఒకరన్నారు. పుస్తకం మొదటి ప్రతిని తానా పత్రిక సంపాదకులు కేసీ చేకూరి స్వీకరించారు. సభకు గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ అధ్యక్షత వహించారు. పుస్తక మహోత్సవ సంఘం పూర్వాధ్యక్షుడు డి.అశోక్ కుమార్, తానా పూర్వాధ్యక్షుడు కోమటి జయరాం, సతీష్ వేమన, రామచంద్ర మిషన్ ప్రతినిధి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌లో పుస్తకాలను తిలకిస్తున్న పుస్తక ప్రియులు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నగరాల సొసైటీ ఆధ్వర్యంలో సాయం అందజేత



వృద్ధులకు భృతి, దుప్పట్లను అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు అవసరమైన సాయాన్ని నగరాల ఎడ్యుకేషన్ సొసైటీ అందిస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీనగరాల ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పాలప్రాజెక్టు ఆవరణలోని వి.కన్వెన్షన్‌లో లబ్ధిదారులకు సాయం అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు పిల్లా మోహనరావు, అసోసియేటెడ్ అధ్యక్షుడు పిల్లా రవి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరాల సంఘ అధ్యక్షుడు బాయన బాబుజీ, మాజీ అధ్యక్షుడు బాయిన వెంకట్రావు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎన్వీ.రావు, తమ్మిన జయ సూర్యనారాయణ, లింగిపిల్లి రామకృష్ణలు విచ్చేశారు. కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.4.20 లక్షలను 200 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు భృతిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు దుస్తులను అందజేశారు. గత 24 ఏళ్లగా సొసైటీలో అనేక మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. సొసైటీ ద్వారా ఉన్నత విద్యలను అభ్యసించిన వారు భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని అతిథులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు లింగపల్లి రామారావు, తమ్మిన దివాకర్, ఆర్.గురునాథం, జగుపిళ్ల రఘుబాబు, సహాయ కార్యదర్శి చొక్కర శ్రీనివాసరావు, కోశాధికారి రాజగిరి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి మల్లిక్



మల్లిక్‌కు శ్రావ్యచిత్రకళా సరస్వతి బిరుదు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి మల్లిక్(మోదిని మల్లికార్జునరావు) విశ్వమాత ఛారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సహకారంతో శ్రీ సరస్వతి కళాపీఠం ఆరో వార్షికోత్సవం, చిత్రకారుడు, గాయకుడు మోదిని మల్లికార్జునరావుకు శ్రావ్యగాన చిత్రకళా సరస్వతి బిరుదు ప్రదానం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ మల్లిక్ చిత్ర కళలోనూ, సంగీత కార్యక్రమంలో విశేష ప్రతిభ చూపుతున్నట్లు తెలిపారు. సరస్వతి కళాపీఠం వ్యవస్థాపకురాలు రోజా ప్రసన్న మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్‌రాజు, పద్మాది కామేశ్వరి, రామకృష్ణ, శ్రీనివాసరావు, శ్రీధర్ బాంధవి, భావన్నారయణ, రత్నకుమారి పాల్గొన్నారు. మల్లిక్‌కు శ్రావ్యగాన కళా సరస్వతి బిరుదు ప్రదానం చేశారు. గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. రోజా వేణుగోపాల్ నిర్వహించారు. అతిథులను నిర్వాహకులు సత్కరించారు.

కల్యాణ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతుడు కల్యాణ్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మహేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుంటూ ఆత్మహత్యకు పాల్పడిన బోయ కల్యాణ్ రెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్ ఆదివారం పరామర్శించారు. తొలుత కల్యాణ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కల్యాణ్ రెడ్డి తల్లిదండ్రులు రామచంద్రారెడ్డి, భారతిలను ఓదార్చి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతుడి తల్లిదండ్రులు మహేష్‌తో మాట్లాడుతూ.. తమ కుమారుడు ఎంతో కష్టపడి చదువుకుంటున్నాడని చెప్పారు. పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ అందుకు అవసరమైన డబ్బు సమకూర్చుకునేవాడన్నారు. ప్రాజెక్ట్ వర్క్ విషయంలో ఎంతో కష్టపడే కల్యాణ్ రెడ్డి కాలేజీ అధ్యాపకుల వేధింపులు, అవమానాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన అధ్యాపకులను చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. ఈ దుర్ఘటనపై అధికారులు, కాలేజీ యాజమాన్యం సరైన రీతిలో స్పందించకపోతే కార్యాచరణ ప్రకటిస్తామని మహేష్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు శ్యామ్, న్యాయవాది ఎం.హనుమాన్ గంగాధర్, షాహినా, మారుతి, సోమశేఖర్, పాట్నూరి శ్రీను, పైలా పవన్, నూకరాజు, చింతాడ నాని, రాజు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి



సిద్ధార్థ మహిళా కళాశాలలో స్టెప్పులేస్తున్న మహిళలు, యువతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం రోగులకు సేవలు అందించడంలో బిజీగా ఉండే వైద్యులు ఆదివారం సాయంత్రం ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. మన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అందులో భాగంగా రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, కోడి పుంజులు, చెరుకు గడలు, భోగి మంటలు ఏర్పాటు చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వైద్యులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం సంప్రదాయ వంటకాలతో విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు బోడేపూడి హనుమయ్య, కార్యదర్శి డాక్టర్ వుమ్మినేని సురేష్, కోశాధికారి డాక్టర్ ఎంవీ సుబ్బారావులతో పాటు, వైద్యులు ఎం.రవీంద్రనాథ్, పరుచూరి అనీల్‌కుమార్, రాంప్రసాద్, మెహబూబ్ షేక్, మనోజ్‌కుమార్, ఎంఏ రెహమాన్‌లతో పాటు నగరానికి చెందిన 500ల మందికిపైగా వైద్యులు పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో..

మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. భోగిమంటలు, రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువు, హరిదాసుల కీర్తనలతో వేడుకలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. కళాశాల ప్రాంగణమంతా గ్రామీణ వాతావరణాన్ని తలపించింది.



సిద్ధార్థ మహిళా కళాశాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ఐఎంఏ హాలులో డ్యాన్స్ చేస్తున్న డాక్టర్లు



ఐఎంఏ హాలులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న వైద్యులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ముగ్గు

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని బెంగళూరులోని సీఎంఆర్ యూనివర్సిటీ మార్కెటింగ్ అడ్మిషన్స్ డైరెక్టర్ రాజ్‌కుమార్ చక్రవర్తి అన్నారు. ఉపాధ్యాయుల శ్రమను మాత్రమే గుర్తించడం కాదని, వారు చేసే గొప్ప పనికి కూడా గౌరవ ప్రశంసలు ఇవ్వాలని ఆయన సూచించారు. బెంగళూరు సీఎంఆర్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలు కార్పొరేట్ కళాశాలల్లో పనిచేస్తున్న 59 మంది అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో ఆదివారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా రేషన్ డిపో నుంచి బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలోని బ్లాక్ నెం 245 రేషన్ డిపో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని వ్యాన్‌లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్ఐ హుటాహుటిన కాలనీకి చేరుకునే సరికి బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ నిండా బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వ్యాన్ డ్రైవర్‌ను వివరాలు అడిగినా సమాధానం చెప్పకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పాలప్రాజెక్టు క్వార్టర్స్‌లోని పోలీస్‌స్టేషన్‌కు చెందిన స్థలంలో భద్రపర్చారు.